క్లుప్తంగా

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన ఆర్డీఓ

రామసముద్రం: రామసముద్రం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ బూత్‌లను శుక్రవారం ఆర్డీఓ మురళి పరిశీలించారు. ఈ సందర్భంగా గదులలో విద్యుత్ , గాలి , వెళ్తురు వాటిని పరిశీలించారు. అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. సక్రమంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నలుగురు బైండోవర్

ములకలచెరువు: గతంలో నాటుసారా విక్రయిస్తు పట్టుబడిన పాత నిందితులను బైండోవర్ చేసినట్లు ఎస్ఈబీ సీఐ మల్లిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్కిల్ పరిధిలోని పెద్దమండ్యం మండలానికి చెందిన నలుగురిని తహసీల్దార్ నిర్మలాదేవి ఎదుట హాజరుపరిచారు. అనంతరం కౌన్సెలింగ్ నిర్వహించి సొంతపూచికత్తుతో వారిని వదిలిపెట్టినట్లు సీఐ వెల్లడించారు.

హత్యాయత్నం కేసు నమోదు చేయాలి

మదనపల్లె : బోయకొండ ఆలయంలో శానిటరీ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యంపై దాడిచేసిన నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని ఆంధ్రప్రదేశ్ వాల్మీకిసంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పులిశ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో దాడి ఘటనలో తీవ్రంగా గాయపడిన సుబ్రహ్మణ్యంను పరామర్శించారు. దాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. బోయకొండ ఆలయంలో పని చేస్తున్న నాగమ్మ కుమారులు భానుప్రకాష్, రాజులు ఫిబ్రవరి 28న సుబ్రహ్మణ్యంపై ఉద్దేశపూర్వకంగా దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. నిందితులపై చౌడేపల్లె పోలీసులు దాడి కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘ నాయకులు జయసింహ, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

కేవీకే సేవలను రైతులకు చేరువ చేయాలి

కలికిరి: కేవీకే సేవలను రైతులకు మరింత చేరువ చేయాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం సహసంచాలకులు డా. సి.రమణ, ప్రధాన శాస్త్రవేత్త డా.ఏ.ఆర్.రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక కేవీకే కార్యాలయంలో 11వ శాస్త్రీయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. సమావేశానికి విచ్చేసిన వారు ఇది వరలో కేవీకే ఆధ్వర్యంలో రైతులకు అందిన సేవలను విచారించారు. ప్రయోగాత్మకంగా సాగు చేసిన ప్రథమ శ్రేణి క్షేత్రాల ఫలితాలను కేవీకే శాస్త్రవేత్తలు వారికి వివరించారు. కేవీకే సేవలను మరింత విస్తృతం చేయాలని వారు సూచించారు. కార్యక్రమంలో కేవీకే సమన్వయకర్త డా.పాండురంగ, శాస్త్రవేత్తలు డా.ఆర్.శారద జయలక్ష్మి, నాగమణి, రాఘవేంద్ర, దేవకి, హేమలత, కలీముల్లా, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విరూపాక్షమ్మ విగ్రహ ప్రతిష్ట

కేవీపల్లె : మండలంలోని మోటుపల్లెవాండ్లపల్లె పంచాయతీ గాజులపల్లెలో నూతనంగా నిర్మించిన ఆలయంలో విరూపాక్షమ్మ విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఆలయంలో గణపతి పూజ, స్వస్తివాచనం, అఖండ దీపారాధన, కలశస్థాపన, హోమాలు నిర్వహించారు. అర్చకులు సురేష్‌శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రాలతో విగ్రహప్రతిష్ట గావించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గజ్జెల శృతి, సర్పంచ్ లక్ష్మీ, వైఎస్సార్‌సీపీ యూత్ మండల కన్వీనర్ గజ్జెల శీన్‌రెడ్డి, తులసీనాథ్, యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై గట్టువెంకటరమణస్వామి

రామసముద్రం: మండలంలోని చెంబకూరు గ్రామంలో వెలసిన శ్రీగట్టువెంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సూర్యప్రభ వాహనంపై స్వామివారు ఊరేగారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

వైభవంగా తిరుచ్చి ఉత్సవం

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తిరుచ్చి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజైన శుక్రవారం ఉదయాన్నే మూలవర్లకు శుద్ధి తోమాల సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి ఊంజల్‌సేవ నిర్వహించారు. తిరుచ్చిలో స్వామివారికి అలంకరణ కావించారు. ఈసందర్భంగా తిరుచ్చి ఉత్సవం గ్రామపురవీధుల గుండా మేళతాళాలతో, జానపద కళాకారుల భజనలతో కన్నులపండుగగా నిర్వహించారు. రంగరంగ వైభవంగా స్నపన తిరమంజనం కావించారు. వాహన మండపంలో స్వామివారి వాహనాన్ని రంగురంగుల పుష్పాలతో అలంకరించారు. స్వామివారు పెద్దశేషవాహనంపై కొలువుదీరి గ్రామ పురవీధుల గుండా రంగరంగ వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారు భక్తుల చేత పూజలు అందుకొన్నాడు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు పాల్గోన్నారు.



స్వామివారికి తిరుచ్చి ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

చాందినీ బండ్లకు పోలీసుల అనుమతి తప్పనిసరి

తరిగొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి తిరునాల ఉత్సవాల్లో చాందినీ బండ్లు ఏర్పాటు చేసుకొనేందుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ దిలీప్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 05 తేదీన తరిగొండలో స్వామివారి తిరుణాల ఉత్సవాలు జరగుతాయన్నారు. తరిగొండతో పాటు పరిసరా 24 గ్రామాల ప్రజలు ఇక్కడి స్వామివారికి చాందినీ బండ్లు కడతారన్నారు. ఇప్పటికే 17 మంది అనుమతి తీసుకొన్నారని అన్నారు. మిగిలిన వారు కుడా అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. డీజేలు గానీ, ఇతన నృత్యాలు, రికార్డింగ్ డ్యాన్స్‌లు వంటివి నిషేధమన్నారు. నిబంధనలకు అనుగుణంగా ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు.



స్వామివారికి తోమాల సేవ నిర్వహిస్తున్న అర్చకులు

ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా పరిశీలన

మదనపల్లె : ప్రకాశం, చిత్తూరు, నెల్లూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాను స్థానిక సబ్ కలెక్టరేట్‌లో శుక్రవారం రెవెన్యూ ఉద్యోగులు పరిశీలించారు. మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాలకు సంబంధించిన ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాలను ఆయా మండల తహసీల్దార్లు, ఎన్నికల డీటీలు, సిబ్బంది పరిశీలించారు. జాబితాలో పురుషుల ఫొటో స్థానంలో మహిళల ఫొటోలతో పాటు, ఏదైనా సాంకేతిక కారణాల రీత్యా ఇతరత్రా ఎలాంటి తప్పులున్నా గుర్తించి వాటిని సరిచేసే క్రమంలో పరిశీలన నిర్వహించారు. మదనపల్లె డివిజన్‌లో ఉపాధ్యాయ, పట్టభద్రులకు సంబంధించి పురుష ఓటర్లు 1,056, మహిళలు 632, గ్రాడ్యుయేట్స్‌కు సంబంధించి 15,453 మంది పురుషులు, 8,282మంది మహిళలు, 1 థర్డ్ జెండర్ ఉన్నారని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి డివిజన్‌లో 44 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తూ, నిర్వహణకు 93మంది ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులను నియమించినట్లు తెలిపారు.



ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న అధికారులు

వన్యప్రాణులను కాపాడుకోవడం బాధ్యత

వాల్మీకిపురం: వన్యప్రాణాలను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు ప్రభుచరణ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరించిపోతున్న జంతువులు, మొక్కలపైన అవగాహన పెంచడానికి, వాటిని రక్షించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మనం పీల్చే గాలి, తినే ఆహారం, మనం ఉపయోగించే శక్తి వంటి అనేక ఇతర ప్రయోజనాల కోసం మొక్కలు, జంతువులపై ఆధారపడి ఉన్నాం అని, మనకు అవసరమైన పదార్థాలన్నీ ప్రకృతి నుండే పొందుతున్నామన్నారు. అయితే రోజు రోజుకు పెరుగుతున్న మానవ అవసరాలు వాతావరణ కాలుష్యం జీవజాతులు, సహజవనరులను, జీవవైవిధ్యాన్ని దెబ్బ తీస్తున్నాయని, రాబోయే దశాబ్దాల్లో అన్ని జాతులలో నాలుగింట ఒక వంతు అంతరించిపోయే ప్రమాదం ఉందన్నారు.

ఘనంగా సీతారాముల విగ్రహప్రతిష్ట

– ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

పెద్దమండ్యం: మండలంలోని కోటకాడపల్లె పంచాయతీ ఎర్రసానివారిపల్లెలో సీతారామలక్ష్మణ హనుమంత సమేత స్వామివార్ల విగ్రహప్రతిష్టా కార్యక్రమం శుక్రవారం వైభవంగా జరిగింది. వేద పండితులు ఉదయం కలశారాధన స్వామివారి మూల మంత్ర జపము చేసి సీతారాముల వారి విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, కళాన్యాస హోమములు, బలిహరణ, మహాఊర్ధాహుతి, కలశోధ్యాసణ, అభిషేకము, మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం జరిపారు. స్వామివారి విగ్రహ ప్రతిష్టా మహోత్సవ ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి వేదపండితులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గుర్రంవాండ్లపల్లె పంచాయతీలోని బత్తినగారిపల్లెలో వెలసిన మల్లీశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి ఆలయ నిర్వాహకులు బద్రయ్యస్వామి, గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టి. రెడ్డి శేఖరరెడ్డి, రాష్ట్ర బిసిసెల్ కన్వీనర్ జి. రమేష్, మాజీ ఎంపీపీ పి. ప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ పీరమ్మ, ఎంపీపీ పూర్ణచంద్రిక, ఎంపీటీసీ సభ్యులు బోడెం రవితేజ, సర్పంచ్ భూదేవి, నాయకులు మధూకరరెడ్డి, కేశవ, రెడ్డెప్పరెడ్డి, వేదపండితులు పాల్గొన్నారు.



స్వామివారి విగ్రహప్రతిష్ట కార్యక్రమంలో ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

వాల్మీకిపురం: చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాయచోటి డీఎస్పీ శ్రీధర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఇరానీ కాలనీలో ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఏలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు, అవాంఛనీయమైన సంఘటనలకు పాల్పడితే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అలాగే ఆ ప్రాంతంలో రెండు ద్విచక్రవాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో సీఐ నాగేంద్ర, ఎస్ఐలు బిందుమాధవి, లోకేష్, దిలీప్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

బి.కొత్తకోట: ఆస్పత్రికి వచ్చే ప్రతిరోగికి మెరుగైన వైద్యం అందించేలా డాక్టర్లు కృషి చేయాలని స్థానిక సీఎహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఆస్పత్రిలో రోగుల సౌకర్యం కోసం ఏర్పాటు చేయాల్సిన పరికరాలు, వసతులపై చర్చించి నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నట్టు చెప్పారు. రోగులసంఖ్య పెరిగిందని, పలు రక్త పరీక్షలు, వైద్యం ఇక్కడే అందిస్తున్నట్టు చెప్పారు. కాన్పులు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తున్నామని చెప్పారు. గతంలో లేని విధంగా ఆస్పత్రి అభివృద్ధి సాధించిందని అన్నారు. సమావేశంలో డాక్టర్లు హసీనా, చరిత, దుర్గాదేవి, సత్య, కమిటి సభ్యులు మహేష్, కళ్యాణ్, మోహన్‌బాబు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

పీలేరు రూరల్ : వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం సిద్ధిస్తుందని డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక చెన్నారెడ్డి వీధిలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు పుట్టకుండా, కుట్టకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూడాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈ కొండయ్య, సూపర్‌వైజర్ కుసుమ, ఏఎన్ఎం విజయకుమార్, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సమష్టి కృషితో క్షయవ్యాధిని అంతం చేద్దాం

కేవీపల్లె : సమష్టి కృషితో క్షయవ్యాధిని అంతం చేద్దామని టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పవన్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని సొరకాయలపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ లక్షణాలు ఉన్నవారికి ప్రభుత్వాస్పత్రిలో ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. టీబీ వ్యాధి గ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా మందుల తోపాటు పోషకాహారం కొరకు నెలకు రూ. 500 వారి ఖాతాకు జమ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రజియాబేగం, సూపర్‌వైజర్ పురుషోత్తం, సీహెచ్‌వో చందన, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

పీలేరు రూరల్ : మండలంలోని కాకులారంపల్లె పంచాయతీ ఇందిరమ్మ కాలనీలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ హరిణి సురేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఇందిరమ్మకాలనీలో కొత్తగా పైపులైను ఏర్పాటు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రూ. 2 లక్షలతో ప్రతి ఇంటికి మంచినీటి కొళాయిలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నాగభూషణంరెడ్డి, రమణ మూర్తి, ఇమ్రాన్, మునిరత్నంరెడ్డి, లోక, శ్రీరాములు పాల్గొన్నారు.



ఇందిరమ్మ కాలనీలో పైపులైన్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

మత్స్యకారుల అభివృద్ధికి సహకారం

పీలేరు రూరల్ : మత్స్య కారుల అభివృద్ధికి తమ వంతు సహకారం ఉంటుందని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, మత్స్యశాఖ అధికారి మోహన్‌కృష్ణ అన్నారు. స్థానికి వారపుసంతలో మత్స్యకారులకు కోసం నిర్మించిన రూములు కేటాయించడానికి శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో లక్కీడిప్ తీశారు. ఎనిమిది మందికి పారదర్శకంగా లక్కీడిప్‌లో వచ్చిన నెంబర్లతో రూములు కేటాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం రాయితీతో రూ. 9.72 లక్షలు రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. రుణాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు ఆనంద్, ఉదయ్, సచిన్, అల్లాబక్షు, జిలానీ, మత్స్యకారులు వెంకటస్వామి, నరసింహులు, దేవి తదితరులు పాల్గొన్నారు.



లక్కీడిప్ ద్వారా రూములు కేటాయిస్తున్న దృశ్యం

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

కేవీపల్లె : ఈనెల 13 నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న అభ్యర్థులను గెలిపించాని వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తృతంగా ప్రచారం చేశారు. శుక్రవారం మండలంలోని జిల్లేళ్లమంద, ఎంపీపల్లె, నూతనకాల్వ, మార్రేళ్ల పంచాయతీలలో పర్యటించి ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఓటర్లను అభ్యర్థించారు. అభివృద్ధిని ఆకాంక్షిస్తూ వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యూత్ విభాగం మండల కన్వీనర్ గజ్జెల శీన్‌రెడ్డి, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ సతీష్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జయరామచంద్రయ్య, సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీలేరు : ఈనెల 13 నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న అభ్యర్థులను గెలిపించాని గ్రామస చివాలయాల మండల కన్వీనర్ ఆనంద్, సర్పంచ్‌లు డాక్టర్ హబీబ్‌బాషా, దండు జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. శుక్రవారం పీలేరు పట్టణంలో కరపత్రాలు పంపిణీ చేసి ఓటర్లను అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అఖండ మెజారిటీ అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఉదయ్ కుమార్, సునీల్, దాదావలి, రియాజ్, ఇంతియాజ్, కరీముల్లా, దావూద్, కాలనీ చిన్న, హరుణ్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఓటర్లను అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దళితులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

పీలేరు : దళితులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని కోళ్లఫారం గ్రామంలో సమావేశం నిర్వహించారు. దళితుల సంక్షేమానికి ఏపీ ఎమ్మార్పీఎస్ కృషి చేస్తోందని తెలిపారు. రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో రాణించడమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు. అక్షరం, అభివృద్ధి, ఆత్మగౌరవం తమ సిద్ధాంతమని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి ఐక్యమత్యంతో ముందుకు సాగుదామని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు గురునాధం, వరదరాజులు, వెంకటేష్, బాలకృష్ణ, గోవిందుస్వామి, శ్రీనివాసులు, పురుషోత్తం, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దాసరి సువర్ణరాజు

పరీక్షలకు ప్రణాళికతో చదవాలి

కురబలకోట: విద్యార్థినులు పరీక్షలకు ప్రణాళికతో చదవాలని జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ, కురబలకోట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ స్పెషలాఫీసర్ టి.త్యాగరాజు సూచించారు. శుక్రవారం సాయంత్రం ఆయన ముదివేడు దగ్గరున్న కస్తూర్బాబ గాంధీ విద్యాలయాన్ని సందర్శించారు. వివిధ శాఖల అధికారులతో కలసి పర్యవేక్షించారు. విద్యార్థినుల్లో అభ్యసన స్థాయిని ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. పరీక్షలు ముంచుకొస్తుండడంతో ఉత్తమ ఫలితాల సాధనకు అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మెరుగైన ఫలితాలకు ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. అన్ని సబ్జక్టుల్లో విద్యార్థులను టీచర్లు సంసిద్ధం చేయాలన్నారు. పరీక్షల సమయం ఎంతో అమూల్యమైనదన్నారు. ఎంఈఓ ద్వారకనాథ్, వైద్యాధికారి క్రిస్టల్, ప్రిన్సిపాల్ పర్వీన్ తదితరులు పాల్గొన్నారు



సమస్యలు తెలుసుకుంటున్న స్పెషలాఫీసర్ త్యాగరాజు

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

నిమ్మనపల్లె : విద్యార్థులు ఉన్నతలక్ష్యాలను నిర్దేశించుకుని చదవాలని ఎంఈఓ రాజగోపాల్ అన్నారు. శుక్రవారం మండలంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ప్రిన్సిపాల్ మునివెంకటమ్మ ఆధ్వర్యంలో వార్షికోత్సవ వేడుకలు, పదోతరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఫేర్‌వెల్ డే నిర్వహించారు. మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ రమణారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోటీప్రపంచంలో విద్యార్థులు మరింత చురుగ్గా వ్యవహరించి బాగా చదువుకోవాలన్నారు. ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సెల్‌ఫోన్, ఇతర వ్యసనాలకు వీలైనంత దూరంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జయప్రకాష్‌రెడ్డి, స్కూల్‌కమిటీ చైర్మన్ హరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి

తంబళ్లపల్లె: బాలికలు ఉన్నత చదువులతో అన్ని రంగాల్లో ముందుండాలని డాక్టర్ మునికుమార్ కోరారు. శుక్రవారం స్థానిక కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ మునికుమార్ మాట్లాడుతూ బాలికలు ఉన్నత ఆశయంతో చదవాలన్నారు. భేటీబచావో.. భేటీ పడావో, లింగ వివక్షతపై వివరించారు. గర్భస్థ పిండ నిర్ధారణ చట్టరీత్య నేరమన్నారు. బాల్య వివాహాలు అరికట్టేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ఆపిల్లల నిష్పత్తి, మగ పిల్లల నిష్పత్తి సమానంగా ఉండేలా చూడాలన్నారు. బాలికలు ఆరోగ్యంపై జాగ్రతలు తీసుకోవాలన్నారు. రక్తహీనత లేకుండా ఆకు కూరలు, పండ్లు తీసుకోవాలన్నారు. ఐరన్‌ఫోలిక్‌ఆసిడ్ మాత్రలు తీసుకోవడం మంచిదన్నారు. కార్యక్రమంలో ఎస్ఓ బి.సుమతి, ఎంపీహెచ్ఈవో రమణ, ప్రజారోగ్య సేవకురాలు కె.సుమలత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



చిరుధాన్యాల సాగుపై అవగాహన



మాట్లాడుతున్న ఏడీఏ శ్రీకాంత్‌రెడ్డి

కేవీపల్లె : చిరుధాన్యాల సాగుపై రైతులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా వనరుల కేంద్ర సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.వి. శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వగల్ల రైతు భరోసా కేంద్రంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రోన్ స్ప్రేయర్, కస్టమ్ హైరింగ్ సెంటర్ (సీహెచ్‌సీ), నానోయూరియా వాడకంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మిరప, మామిడి పంటల సస్యరక్షణ చర్యలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఓ శ్రావణి, ఆర్‌బీకే సిబ్బంది అనిత, ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణోత్సవం

వాల్మీకిపురం: స్థానిక శ్రీ పట్టాభిరామాలయంలో శుక్రవారం శ్రీరాముడి జన్మ నక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీ సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి సేవా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం స్వామి వారికి అర్చన, అభిషేకం, తోమాలసేవ తదితర కార్యక్రమాల అనంతరం విశేష అలంకరణలో ముస్తాబైన ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలోని ఆస్థాన మండపంలో సంప్రదాయబద్ధంగా తీసుకెళ్లి ఆశీనులను చేశారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. చివరగా హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలతో కల్యాణోత్సవం నిర్వహించారు.

